క్లుప్తంగా

నేడు సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: గాన గంధర్వ పద్మ భూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన గాయకులు బాలకోటేశ్వరరావు, హనుమంతరావు, రాధిక, కర్నూలు గాయని ప్రియాంకలు సంగీత విభావరిలో ఎస్పీ బాలు పాడిన పాటలను గానం చేస్తారని పేర్కొన్నారు.

రూ.6 కోట్లతో సీ క్యాంపు రైతుబజారు విస్తరణ

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సి.క్యాంపు రైతుబ బజారును రూ.6 కోట్లతో విస్తరించనున్నారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 110 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పులో విస్తరించడానికి మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. అండర్ గ్రౌండ్‌లో పార్కింగ్ సదుపాయం కూడా ఉంటుంది. 130 షెడ్లు, 60 షాపులు ఉంటాయని అధికార వర్గాలు తెలిపాయి.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలు వివరిస్తున్న పోలీసు అధికారి

కర్నూలు: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలతో పాటు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

తగ్గిన వ్యవసాయ ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వ్యవసాయ ఉత్పత్తులు రావడం తగ్గిపోయింది. ఉల్లి, ఎండుమిర్చి వంటి పంటలు కొద్ది రోజులుగా మార్కెట్‌కు రావడం లేదు. దీంతో మార్కెట్ యార్డు వెలవెలబోతోంది. కర్నూలు మార్కెట్‌లో మొదటిసారిగా వరి దాన్యం క్రయవిక్రయాలకు అవకాశం కల్పించినప్పటికీ పంట తీసుకు రావడం లేదు. శనివారం కేవలం 33 మంది రైతులు వివిధ పంట ఉత్పత్తులు 197 క్వింటాళ్లు మాత్రమే తెచ్చారు. వేరుశనగ 41 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. కందులు 90 క్వింటాళ్లు వచ్చినప్పటికి ధర నిరాశజనకంగా లభించాయి. కనిష్ఠ ధర రూ.3070, గరిష్ఠ ధర రూ.6419 మాత్రమే లభించింది. కొర్రలు, మినుములు, సజ్జలు, మొక్కజొన్నలు అతి తక్కువగా వస్తున్నాయి. ఆగస్టు నెల వరకు మార్కెట్‌కు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

డాక్టర్ వెంకటేశ్వరరావుకు సన్మానం



డాక్టర్ బి.వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీఎస్ఆర్ఎంఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న డాక్టర్ బి.వెంకటేశ్వరరావును శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడేళ్ల పాటు సీఎస్ఆర్ఎంఓగా డాక్టర్ వెంకటేశ్వరరావు మెరుగైన వైద్యసేవలందించారన్నారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు, శానిటేషన్, సెక్యూరిటీ.. ఇలా అన్ని వర్గాలతో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రిలో సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గోవిందు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)పై పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎస్జీటీలకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎంటీఎస్ టీచర్ల జాబితాలను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టామని డీఈఓ పేర్కొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం





ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్యాకెట్ పార్కులో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(హాస్పిటల్)/(టౌన్): మన నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ కోరారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ అరుణ, డీఐవో డాక్టర్ నాగప్రసాద్, డీపీఎంవో డాక్ట ర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఉమామహేశ్వరప్రసాద్, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎస్‌వో హేమసుందరం, డీపీహెచ్ఎన్‌వో అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ ఆసుపత్రి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాల ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అనంతరం సదరం క్యాంపు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్లు శివబాలనాగాంజన్,కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో...

స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో పరిసరాలను పరిశుభ్రం చేయడం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైద్యులు మంజులబాయి, శోభారాణి, సోమశేఖర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నగరంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక సంస్థ కమి షనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. శనివారం స్థాని క స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ నది ఒడ్డున నూతన ప్యాకెట్ పార్కులో మొక్కలు నాటారు. అలాగే 500 మొక్కలు పంపిణీ చేశారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి పాల్గొన్నారు

మోదీ మెప్పు కోసం గిరిజన విద్యార్థులకు ఇబ్బందులా?



వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గౌతమ్

కర్నూలు(టౌన్): దేశ ప్రధాని మెప్పు కోసం గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె. గౌతమ్ అన్నారు. గిన్నిస్‌బుక్ రికార్డు కోసం వేలాది మంది సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను, గిరిజన విద్యార్థులను శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో బస్సుల్లో తరలించడం దారుణమన్నారు. యోగా నిర్వహించే ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇదే తరహాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల పిల్లలను తరలిస్తారా అని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థులకు జ్వరం, వాంతులు వస్తే ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లు ఉండవని, అదే యోగాంధ్రకు మాత్రం ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేశారన్నారు. నిజంగా ఈ ప్రభుత్వానికి గిరిజన విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

యువత మత్తుకు బానిస కాకుండా చూడాలి

- ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్

కర్నూలు : యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా చూడాలని, ఈ విషయలంఓ వైద్యులు కీలకపాత్ర వహించాలని ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం విద్యార్థులకు నషా ముక్త్ భారత్ అభ్యాన్, ఈగల్ క్లబ్స్ గురించి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, సోమశేఖర్‌తో పాటు ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా భవిష్యత్తు వైద్యులు వారిని చైతన్య పరచాలన్నారు. మత్తు వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరిస్తూ వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించాలని కోరారు.



మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య విద్యార్థులు, డాక్టర్లు

అలాగే ఆసుపత్రికి పేషెంట్లుగా వచ్చే వారికి కూడా ఆరోగ్య జాగ్రత్తల పట్ల సలహాలు ఇవ్వడం ద్వారా మార్పు తేవాలన్నారు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, పునరావాస కేంద్రాల ద్వారా బాధితులను మళ్లీ సామాజిక జీవనానికి అలవాటు చేయడం వంటివి వైద్యులతోనే సాధ్యమని చెప్పారు.

పార్కు స్థలాన్ని ఖాళీ చేయాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 19 వ వార్డు నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ లేఔట్ ప్లాన్ నెంబర్ 116/89 లో అన్యాక్రాంతమైన పార్కు స్థలాన్ని ఖాళీ చేయాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశాలు జారీ చేశారు. శనివారం పార్కు స్థలాన్ని కమిషనర్ రవీంద్రబాబు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పార్కు స్థలంలో నివాసం ఉంటున్న వారితో జేసీ మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కు స్థలంలో నివాసాలు ఏర్పాట చేయడం కోర్టు ఆదేశాలకు విరుద్ధమని ఇక్కడ ఉన్న వారంతా ఖాళీ చేయాలన్నారు. గృహాల కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హతలను బట్టి మంజూరు చేస్తామన్నారు. అన్యాక్రాంతమైన పార్కు స్థలాల్లో ప్రస్తుతం ఉన్న స్థితిగతులను క్షేత్ర స్థాయిలో సర్వే చేసి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.



పార్కు స్థలంలో నివాసాలపై కమిషనర్‌తో చర్చిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

పోలీసు లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు

కర్నూలు : మూర్ఛ వ్యాధికి గురై కొన్ని నెలలుగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందిన ఆత్మకూరు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు భౌతిక కాయానికి శనివారం కల్లూరు శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మిడుతూరు ఎస్ఐ ఓబులేసు, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజుతో పాటు కుటుంబ సభ్యులు, సహోద్యోగులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కళ్లను కుమారుడు సందీప్, కుటుంబ సభ్యులు మూర్తి కలిసి కర్నూలు ఐ–బ్యాంక్‌కు దానం చేశారు. టెక్నీషియన్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఔషధ నియంత్రణ శాఖ డీడీ బదిలీ

కర్నూలు (హాస్పిటల్): ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశేఖర్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయనను విశాఖపట్నంకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఒడిశా వాసి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఒడిశా వాసి

కర్నూలు: ఉపాధి నిమిత్తం వలస వచ్చి కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నివాసముంటున్న ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ గ్రామానికి చెందిన సుశాంత్ కుమార్ దాలియా (36) చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన స్థానిక జీఎస్ ప్లాస్టిక్ రీ సైక్లింగ్ ఫ్యాక్టరీలో నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న ఈయన శుక్రవారం రాత్రి భార్య మున్నీకి ఫోన్ చేశాడు. మాటల సందర్భంలో ఆమెతో గొడవ పడి క్షణికావేశంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతుండగా ఫ్యాక్టరీ మేనేజర్ ప్రదీప్ చుట్టు పక్కల వారి సహాయంతో ఉరి నుంచి తప్పించి వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ కేంద్రంలో భద్రపరచి మృతి సమాచారాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు చేరవేశారు.

సబ్ జైలు తనిఖీ

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌జైలును శనివారం జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె. సుధ సందర్శించారు. ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలపై జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. క్షణికావేశంలో జైలుకు వచ్చి ఉంటారని, ఇకనైనా మంచి నడవడికను నడుచుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

కల్లూరు: చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సల్కాపురం గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో, బేటీ పఢావో అనే నినాదంతో ఆడపిల్లలను రక్షించాలి, ఆడపిల్లను చదివించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

గడివేముల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన అవసరమని నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావున అతిసార కేసులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పెసరవాయిలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పోస్టర్లను విడుదల చేశారు. ఆయన వెంట డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీహెచ్ఈఓలు జగదీశ్వరప్ప, మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీ అలీబాషా, ఏఎన్ఎం దేవకుమారి, ఆశాలు పాల్గొన్నారు.



పెసరవాయిలో అతిసార నివారణ పోస్టరును విడుదల చేస్తున్న దృశ్యం

‘ఎల్లార్తి’లో భక్తులు, నిర్వాహకుల మధ్య గొడవ

- చదివింపులు, దర్శనంపై వాగ్వాదం

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలో శుక్రవారం రాత్రి దర్గా నిర్వాహకులు, దర్శనం కోసం వచ్చిన గుంతకల్లు ప్రాంతానికి చెందిన భక్తుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గుంతకల్లుకు చెందిన నవాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లార్తి దర్గాకు వచ్చారు. దర్గాలో దువా, చదివింపుల విషయంలో వారికి, నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. హుండీలో వేసే కానుక, టెంకాయ కొట్టేందుకు తాము అడిగిన మొత్తాన్ని ఇవ్వాలని దర్గాలోని సిబ్బంది డిమాండ్ చేశారని, ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినందుకు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ గొడవకు దిగారని నవాజ్ ఆరోపించాడు. అలాగే ఆయన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దర్గాకు కోట్ల ఆదాయం వచ్చినా బాత్‌రూంలు, మరుగుదొడ్లు ఇతర వసతులు లేవని భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. కాగా దర్శనానికి వెళ్లిన సమయంలో భక్తులు, నిర్వాహకులు మధ్య తోపులాట, దాడులు చేసుకున్నట్లు తెలిసింది. తమరు కొట్టారని భక్తులు ఆరోపించారు. కాగా ఈ ఘటనకు రాజకీయం పులిమి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వివాదాన్ని దారి మళ్లించేందుకు యతిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల దర్గాల విషయంలో వివాదాలు, విమర్శలు, సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఎలార్తి దర్గాలో భక్తులు, సిబ్బంది మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం





డీపీఓలో యోగాసనాలు చేస్తున్న పోలీసు సిబ్బంది, యోగా చేస్తున్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ కరణం కిశోర్‌కుమార్, సిబ్బంది

ఆరోగ్యమే హద్దుగా..

- నగరంలో ఘనంగా యోగా దినోత్సవం
- యోగాసనాలు సాధన చేసిన యోగాభ్యాసకులు



యోగాసనాలు సాధన చేస్తున్న ఆర్‌యూ వీసీ, ఆచార్యులు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. ఆరోగ్యమే హద్దుగా అన్ని వర్గాల ప్రజలు యోగాసనాలు వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, యోగా శిక్షణ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో యోగా గురువులు, వక్తలు మాట్లాడారు. యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు ఎలాంటి ఖర్చు లేకుండా యోగ సాధన చేయవచ్చని, దీర్ఘకాలిక రోగాల నివారణకు ఇది దివ్య ఔషధమని చెప్పారు. ఒక్కో ఆసనం ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు.

☛ రాయలసీమ విశ్వవిద్యాలయంలో వీసీ వి. వెంకట బసవరావు అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగా శిక్షకురాలు ఉమ యోగాసనాలు సాధన చేయించారు.

☛ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్.షా.వలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్. లోకనాథ ప్రసంగించారు.

☛ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి ప్రకాష్ పాల్గొని ప్రసంగించారు. యోగా మాస్టర్లు విశ్వనాథ రావు, వెంకటేశ్వర్లు యోగాసనాలు సాధన చేయించారు. ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాష, కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్, ఏవో చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కర్నూలు : జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్‌మైదానంలో పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించారు. అడ్మిన్ ఆర్ఐ జార్జి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాకు కొంత సమయాన్ని కేటాయిస్తే ఒత్తిడి నుంచి బయటపడొచ్చన్నారు. డీపీఓలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్రటరీ జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు డాక్టర్ ఆదినారాయణ రెడ్డి హాజరై యోగా చేయించారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది యోగా చేశారు.

☛ కర్నూలు మెడికల్ కాలేజీలోని ఎగ్జామినేషన్ హాలులో యోగాగురువు శివరాజు, ఉపేంద్ర, రంగా, శ్రీనివాసులు సూచనలు, సలహాలతో వైద్యు లు, విద్యార్థులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కార్మిక శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు సంయుక్త కార్మిక శాఖ కమిషనర్ యం. బాలునాయక్ చెప్పారు. అలాగే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.







యోగాసనాలు చేస్తున్న పెద్దాసుపత్రి సూపరింటెండెంట్, మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఉర్దూ వర్సిటీ వీసీ

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి



శిలా మండప నిర్మాణం

- కౌతాళంలో ముమ్మరంగా ఆలయం అభివృద్ధి పనులు
- ఉత్తర ద్వారంలో స్వామి ఉండటం ప్రత్యేకత
- రూ. కోటితో శిలా మండపంతో పాటు మహాద్వార నిర్మాణం
- దాతలు సహకరించాలని కోరుతున్న కమిటీ సభ్యులు

కౌతాళం: కలియుగ దైవంగా భావించే వేంకటేశ్వరస్వామిని భక్తిభావంతో కొలుస్తారు. చాల కుటుంబాలకు ఆయనే ఇంటి దేవుడు. మండల కేంద్రమైన కౌతాళంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కమిటీ సభ్యులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు కోటి రూపాయలు భక్తుల విరాళాలతో గర్భాలయం చుట్టూ శిలా మండపంతో పాటు మహా ద్వారం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు జోరందుకున్నాయి. ఈ పనుల కోసం భక్తులు ముందుకు వచ్చి విరాళాలను ఇస్తున్నారు. వచ్చే జనవరి 2026లోపు దీనిని పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం ఉత్తర ద్వారంలో ఉండడం ఎంతో విశిష్టం. దేవాలయం నిర్మాణం కోసం ఎవరైన నేరుగా బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలను కోనే వారు కోరుతున్నారు. దాతలు కౌతాళం కెనారా బ్యాంకు అకౌంట్ 120026171350 నంబర్ శ్రీనివాస సేవ ట్రస్టు పేరిటా కూడా విరాళాలు జమ చేయవచ్చు అని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు అందరి సహకారం ఎంతో అవసరమన్నారు.



వేంకటేశ్వరస్వామి

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ నగర అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, సతీమణి విజయ మనోహరి లక్ష్మీనగర్‌లోని మృతుడి ఇంటికి వెళ్లారు. భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, 23 వ వార్డు ఇన్‌చార్జ్ కటారి సురేష్ , లాజరస్, బుల్లెట్ అంజి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.



భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి, విజయమనోహరి